31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం 19 ఏప్రిల్ 2026 | పేజీలు : 8

జగిత్యాలకు త్వరలో పోస్ట్ ఆఫీస్

# పాస్ పోర్టు సేవా కేంద్రం

### కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ ను కలిసిన నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లాలో పోస్ట్ ఆఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. శనివారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురితో బిజెపి రాష్ట్ర కార్యవర్గ -2లో



జగిత్యాల సభ

## బిఆర్ఎస్ బహిరంగ సభనా..?

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేరిక సభనా..?
- మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు ప్రకటించాలి
- సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ అక్రమ సంపాదనతో జన సమీకరణ
- సభకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18:** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మీటింగ్ జీవన్ రెడ్డి చేరిక సభనా..? బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభనా..? ప్రకటించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మోతే రోడ్ లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. -2లో

- ఆశావహుల కోలాహలం... రాజకీయ చదరంగం
- హామీల భారం.. పదవుల పంపకం :
- ధర్మపురి కాంగ్రెస్ అంతర్గత మథనం
- 15 వార్డుల గెలుపు టెక్కు...
- కానీ 4 పదవులకే అసలు చిక్కు!




## ధర్మపురి

# కో ఆప్షన్ రాజకీయం

**రామ కిష్టయ్య సంగన భట్ల**

**ధర్మపురి, చురకలు :** మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం స్థానిక రాజకీయాల్లో తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం ఏర్పడిన ఈ పరిస్థితి, అధికార పార్టీకి చెందిన నాయకత్వానికి ఒక విధమైన రాజకీయ పరీక్షగా మారింది. ఎన్నికల సమయంలో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు, అప్పట్లో ఇచ్చిన హామీలు, స్థానిక సమీకరణాలు---కలసి ఇప్పుడు సంక్లిష్ట సమీకరణాలుగా మారి, నాలుగు కో-ఆప్షన్ సభ్యుల ఎంపికను అత్యంత క్లిష్టంగా నిలబెట్టాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తే, ధర్మపురి పట్టణ రాజకీయాల లోతైన వాస్తవాలు, నాయకత్వ నైపుణ్యం, పార్టీ అంతర్గత సవాళ్లు స్పష్టంగా బయటపడు తున్నాయి.మున్సిపల్ ఎన్నికల సమయంలో ధర్మపురి పట్టణ పరిధిలోని 15 వార్డులకు గాను భారీగా ఆశావహులు పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చాలా కాలంగా స్థానికంగా అధికారంలో లేని నేపథ్యంలో, ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టిక్కెట్ల కోసం పోటీపడ్డారు. ముఖ్యంగా పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన సీనియర్లు, కేడర్‌కు చెందిన నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర -2లో

## రేవంత్ రెడ్డి పోవాలి... కేసిఆర్ రావాలి

- ఎంపి తేజస్వి యాదవ్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి హరీష్ రావు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** పార్లమెంటులో భాజపా ఎంపీ తెలంగాణపై మాట్లాడిన మాటలు తెలంగాణ ఆత్మగౌవరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, బిజెపి ఎంపి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనను ఇండియా పాకిస్తాన్తో పోల్చటం 4 కోట్ల ప్రజలను ఆవమాన పరచటమేనని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీషారావు బిజెపిపై మండిపడ్డారు. జగిత్యాలలో ఈ నెల 20న జరగనున్న కేసీఆర్ సభ ఏర్పాట్లను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలు అమరుల త్యాగాలను చిన్న చూపు చూడటమేనని, తెలంగాణపై ఇది విషం చిమ్మే ప్రయత్నమని మండిపడ్డారు. ఎంపీ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తప్పుగా మాట్లాడితే క్షమాపణ చెప్పించాలి గానీ వెనుకేసక వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో భారాస ఎంపీలు లేని లోటు కనిపించిం దని, 8 మంది కాంగ్రెస్, 8 మంది భాజ పా ఎంపీలు ఉన్నా ఒక్కరూ ఖండించలే దన్నారు. యావత్ తెలంగాణకు బిజెపి ఎంపీ బేషరుషతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే భారాస ఊరుకోదన్నారు. రేవంత్రెడ్డి భాజాపా -2లో

నిర్దేశించిన ఉపాధి హామీ

## లక్ష్యాలను పూర్తి చేయాలి

- ఉపాధి హామీ పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు విలేకరి, మల్లాపూర్, ఏప్రిల్ 18:** నిర్దేశించిన ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మరిన్ని కూలీలను ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం చేయాలని, ప్రతి గ్రామంలో పనుల అందుబాటును పెంచాలని ఆదేశించారు. పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పనుల ప్రగతిని రోజువారీగా పర్యవేక్షించాలని, కూలీల హాజరు నమోదు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మస్టర్ రోల్స్ లో ఎటువంటి లోపాలు ఉండకూడదని కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోలన్నారు. పనుల తీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి పనిని ఫోటో క్యాప్చరింగ్ -2లో

## కోరుట్లలో గంజాయి సేవనం..ముగ్గురు అరెస్ట్



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్,18 :** కోరుట్ల పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి సేవనం జరుగుతున్నదన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రైడ్ నిర్వహించారు. ఈ రైడ్‌లో ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఇద్దరు ప్రభుత్వ పంచులు పాల్గొన్నారు.రైడ్ సందర్భంగా అక్కడ గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులు అబ్దుల్ ఉమేర్, షేక్ ఆరిఫ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు గత కొద్ది రోజులుగా గంజాయి సేవనానికి అలవాటు పడి కోరుట్ల పట్టణంలో మామిడికాయల బండి వద్ద పనిచేస్తున్న కృష్ణ జూంబేకర్ (33 సంవత్సరాలు అమరావతి జిల్లా మహారాష్ట్ర) వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసి తాగుతూ అవసరమైతే ఇతరులకు కూడా విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.దీనిపై పోలీసులు కృష్ణ జూంబేకర్‌ను కూడా అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి సుమారు 80 గ్రాముల గంజాయి మరియు 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నష్టపరిహారం చెక్కు అందజేసిన మంత్రి అడ్లూరి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలకు చెందిన రాపాక మహెందర్ కు చెందిన గేదె విద్యుతా ఘాతంతో మృతిచెందగా ప్రభుత్వం మంజూరి చేసిన రూ 40వేల నష్ట పరిహారం చెక్కును శనివారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్ చేతులమీదుగా యజమానికి విద్యుత్ అధికారులు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి పోవాలి... కేసిఆర్ రావాలి

**మొదటి పేజీ తరువాయి...** బంధం హైబ్రిడ్ గా అర్థమైందని, రేవంత్ రెడ్డి, భాజపా రెండు పార్టీలు మహిళలకు ద్రోహం చేశారన్నారు. బిల్లును డీలిమిటేషన్ కు ఎందుకు లింక్ చేశారని, మూడో వంతు మెజార్టీ లేదని తెలిసి బిల్లు పెట్టారని, భాజపాకు మహిళా రిజర్వేషన్ పై చిత్తశుద్ధి లేదన్నారు. రేవంత్ డ్రామాలు ప్రజలకు అర్థం అవుతున్నాయని, ఒకరిపై ఒకరూ నెపం నెట్టి మహిళలకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి అనేది 4 కోట్ల ప్రజలు ఆకాంక్ష అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

## జనాభా గణన మొదటి దశ శిక్షణ ప్రారంభం

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం లో జనాభా గణన 2027 మొదటి దశలో భాగంగా గృహాల జాబితా పరిశీలన మొదటి బ్యాచ్ ఎన్యుమ రేటర్ సూపర్ వైజర్లశిక్షణకార్యక్రమం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రారంభించారు.ఈ శిక్షణ ఏప్రిల్ 18 నుండి 21వరకు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు స్థానిక తహశీల్దార్ శేఖర్ తెలిపారు.?శిక్షణలో శనివారం సిపిఓ సత్యం తహశీల్దార్ ఆర్, శేఖర్, ఎంఈఓ ప్రభాకర్, జగిత్యాల డివిజన్ డిప్యూటీ ఎస్ ఓ రామకృష్ణ, కార్యాలయసిబ్బంది 32 మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# ధర్మపురి కో-ఆప్షన్ రాజకీయం

**మొదటి పేజీ తరువాయి....** సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ప్రతి వర్గానికీ న్యాయం చేయాలనే ప్రయత్నంలో, ఆయన అనేక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టారు.అయితే ఈ ప్రక్రియలో ఒక కీలక వ్యూహం అమలు చేశారు. ప్రత్యర్థి బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ప్రజాప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానించి, వారిని అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా గెలుపు అవకాశాలను బలోపేతం చేశారు. ఇది రాజకీయంగా వ్యూహాత్మక నిర్ణయం కావడంతో పాటు, కొంతమంది సొంత పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తికి దారితీసింది. అయినప్పటికీ, ఈ వ్యూహం ఫలితాన్నిచ్చింది. ధర్మపురి మున్సిపాలిటీలో 15కు 15 సీట్లను గెలుచుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ విజయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ప్రశంసలు అందుకోవడం, మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు వ్యక్తిగతంగా కూడా ప్రతిష్ఠను తెచ్చింది.కానీ ఈ విజయానికి పునాది అయిన హామీలు ఇప్పుడు భారంగా మారాయి. టిక్కెట్లు ఇవ్వలేకపోయిన అనేక మంది ఆశావహులను సమర్థంగా ఒప్పించడానికి, వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు, కో-ఆప్షన్ సభ్యత్వాలు ఇస్తామని హామీలు ఇచ్చారు. ఇదే సమయంలో స్థానికంగా ప్రభావం ఉన్న నాయకులు కూడా తమ అనుచరులకు ఈ పదవులు ఇప్పిస్తామని మాట ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఈ హామీలు, అప్పట్లో పార్టీ ఐక్యతకు దోహదపడినా, ఇప్పుడు నిర్ణయ ప్రక్రియను క్లిష్టతరం చేస్తున్నాయి.ప్రస్తుతం కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియలో నాలుగు స్థానాలకు గాను 16 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడం పరిస్థితిని మరింత గందరగోళంగా మార్చింది. వీరిలో చాలా మంది మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీకి నిబద్ధతతో పనిచేసిన నాయకులు, సామాజికంగా ప్రభావం కలిగిన వ్యక్తులు ఉన్నారు. అందరూ తమ తమ వాదనలు వినిపిస్తూ, తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవ్వరినీ నిరాశ పరచకుండా, సమతుల్యంగా నిర్ణయం తీసుకోవడం పార్టీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారింది.కో-ఆప్షన్ సభ్యుల ఎంపికలో కొన్ని నియమాలు, సామాజిక సమీకరణాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. నాలుగు స్థానాల్లో రెండు మైనారిటీలకు, రెండు ఇతర వర్గాలకు ఇవ్వాల్సి ఉండటం, అలాగే అందులో కనీసం రెండు స్థానాలు మహిళలకు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ పరిమితులు ఉన్నప్పుడు, అభ్యర్థుల ఎంపిక మరింత సంక్లిష్టంగా మారుతుంది. ప్రతి వర్గం తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ, రాజకీయ ఒత్తిడిని పెంచుతోంది. దీనివల్ల నాయకత్వానికి సమతుల్యత పాటించడం కష్టతర మవుతోంది.ప్రస్తుత పరిస్థితుల్లో ఆశావహులు ... కాంగ్రెస్ సీనియర్ నేత, ఇటీవలే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ సంగన భట్ల, గత మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా ఉన్న, ప్రస్తుతం మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మిలను ప్రభావితం చేసి, ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇక ఈ ప్రక్రియలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాత్ర అత్యంత కీలకంగా మారింది. చట్టపరంగా, రాజకీయంగా కూడా చైర్‌పర్సన్ అభిప్రాయం నిర్ణయంలో ప్రభావం చూపగలదు. అందుకే ఆశావహులంతా చైర్‌పర్సన్ చుట్టూ తిరుగుతూ, తమ అభ్యర్థనలను వినిపిస్తున్నారు. ఇది ఒకవైపు రాజకీయ చురుకుదనాన్ని సూచిస్తే, మరోవైపు అంతర్గత పోటీ తీవ్రతను కూడా ప్రతిబింబిస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు ఇది ఒక కీలక పరీక్షగా మారింది. ఎన్నికల సమయంలో చూపిన వ్యూహాత్మక నైపుణ్యాన్ని ఇప్పుడు సమతుల్య నిర్ణయాల్లో కూడా చూపించాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారిని గౌరవించాల్సి ఉంది; మరోవైపు బలమైన నేతలను, గత ఎన్నికలలో సహకరించిన వారిని, సామాజిక సమీకరణాలను పాటించాల్సి ఉంది; మరోవైపు భవిష్యత్తులో పార్టీ ఐక్యత దెబ్బతినకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. ఈ మూడు అంశాల మధ్య సమతుల్యత సాధించడం నాయకత్వానికి నిజమైన సవాలు.ఇది కేవలం నాలుగు పదవుల ఎంపిక మాత్రమే కాదు; ఇది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి, నాయకత్వ నైపుణ్యానికి ఒక అద్దం పట్టే సందర్భం. సరైన నిర్ణయం తీసుకుంటే పార్టీ బలోపేతం అవుతుంది; లేకపోతే అసంతృప్తి పెరిగి, భవిష్యత్తులో రాజకీయ ప్రతికూలతలకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ఏర్పడే అసంతృప్తి, పెద్ద రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపగలదు. ధర్మపురి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ఒక సాధారణ పరిపాలనా ప్రక్రియగా కనిపించినా, దాని వెనుక ఉన్న రాజకీయ వాస్తవాలు, హామీల భారాలు, సామాజిక సమీకరణాలు--- కలసి దీనిని ఒక క్లిష్టమైన రాజకీయ సమీకరణంగా మార్చాయి. ఈ సవాల్‌ను నాయకత్వం ఎలా ఎదుర్కొంటుందో అనేదే భవిష్యత్తు రాజకీయ దిశను నిర్ణయించగల అంశంగా మారింది.

### జగిత్యాల సభ

## బిఆర్ఎస్ బహిరంగ సభనా..?

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడ బహిరంగ సభలు ఏర్పాటు చేసుకున్న తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఈనెల 20వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే సభపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు క్లారిటీ ఇవ్వాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అడ్డగోలుగా అక్రమ సంపాదన చేసిన డబ్బుతో జగిత్యాల సభకు జన సమీకరణ చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కేవలం 12వేల నుండి 15వేల మందితో సభ నిర్వహించుకునే స్థలంలో నియోజకవర్గానికి ఒక ఇన్ చార్జీని నియమించి జన సమీకరణ చేస్తున్నారన్నారు.సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి పార్టీ వీడడం బాధాకరంగా ఉందన్నారు. పార్టీ వీడుతున్న జీవన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను మంత్రి ఖండిస్తున్నామని, బీఆర్ఎస్ పార్టీ గొప్పగా పనిచేసిందని జీవన్ రెడ్డి అంటున్నారని మరి బీఆర్ఎస్ పార్టీ గొప్పగా పని చేస్తే 2023 ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఓట్లు వేయలేదని మంత్రి ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలవలేదని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి సాధించిందని, పంచాయతీ ఎన్నికల్లో మున్సిపల్ ఎన్నికల్లో సైతం అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించిందని మంత్రి వివరించారు. జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించడం తగదని ఎందుకు రేవంత్ రెడ్డి దిగిపోవాలని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసి, సన్న బియ్యం అందిస్తున్నందుకు దిగిపోవాలా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల సాయం అందిస్తున్నందుకు దిగిపోవాలా, ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నందుకు దిగిపోవాలా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నిర్దేశించిన ఉపాధి హామీ

## లక్ష్యాలను పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**ద్వారా ఎన్ఎంఎంఎస్ యాప్ లో నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ఉపాధి హామీ పనులకు వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేయాలని, షేడ్ నెట్ లు తగిన నీడ, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్రథమ చికిత్స మరియు తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పెల్లి ఆర్డీవో నరసింహ రావు, డి ఆర్డిఓ రఘువరన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాలకు త్వరలో...

**మొదటి పేజీ తరువాయి...**సభ్యురాలు డా.బోగ శ్రావణి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ను న్యూ ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ప్రత్యేక పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుపై విజ్ఞప్తి పత్రాన్ని అందించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సానుకూలంగా స్పందించి, జగిత్యాల జిల్లాలో పాస్పోర్ట్ సేవల అవసరాన్ని గుర్తించి, త్వరలోనే పాస్ పోర్టు కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రం ఏర్పాటుతో జగిత్యాల, పరిసర ప్రాంతాల ప్రజలకు పాస్ పోర్ట్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని డా.బోగ శ్రావణి తెలిపారు.

# ప్లాస్టిక్ నిషేధిత గ్రామంగా తీర్చి దిద్దుకుందాం

**ఏప్రిల్ 30 మెదలు వినియెగం,విక్రయం నిషేధం**
**-గోదుర్ గ్రామ సర్పంచ్ బండి రాజేష్**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఎప్రిల్ (18) :** ప్లాస్టిక్ నిషేధిత గ్రామంగా గోదురు గ్రామాన్ని తీర్చి దిద్దుకుందామని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదుర్ గ్రామ సర్పంచ్ బండి రాజేష్ అన్నారు.శనివారం గ్రామంలోని మహిళ సంఘ భవనం లో సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజేష్ మాట్లాడుతు గ్రామంలో ప్లాస్టిక్ నిషేధానికి మహిళా సంఘంల సహ కారం కావలని,ప్లాస్టిక్ పూత కలిగిన పేపర్ గ్లాసులను పూర్తిగా పక్కన పెట్టి,స్టీలు గ్లాసులు కొనుగోలు చేసి వాడడం నేటి నుండి ప్రారంభించ లన్నారు,మాటల్లో కాదు,చేతల్లో చూపించారు.మహిళా భవనం వద్ద అందరూ స్టీలుగ్లాసులు చేతపట్టి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.గ్రామంలో మార్పు కోసం మహిళా సంఘం బాటలో మిగతా అందరూ నడవాలని,కిరణం షాపులు, ఫంక్షన్లు,ఇండ్లు అన్నిచోట్ల ప్లాస్టిక్ నిషేదించి,ఎప్రిల్ 30 నుండి ఊర్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషెదించి,పేపర్ ప్లేట్లు సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ పూత కలిగిన టీకప్పులు పూర్తిగా నిషేధించి క్యాన్సర్ తదితరు రోగాల బారిన పడకుండా ఉండేందుకు అవ గాహన కల్పించి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అందరి సహకారంతో ముందుకు నడుస్తామన్నారు.ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ ఓంకారి లక్ష్మణ్ ,పంచాయతీ కార్యదర్శి ఆర్షద్,వివో అరుణ,వార్డు సభ్యులు,మహిళా సంఘాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత పై దృష్టి...!

**-తాత్కాలిక సిబ్బందితో పనులు,పంచాయతీలో కార్మికుల కొరత**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (18) :** ప్రజా ఆరోగ్య ని రక్షించేందుకు పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రతినిత్యం వార్డులోని చెత్తాచెదారం డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచుతూ ఆదర్శ గ్రామంగా ఉంటమే లక్షం గా శనివారం గ్రామపంచాయతీ పాలకవర్గం ముందుకు సాగుతుంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపుర్ గ్రామంలో గ్రామపంచాయతీ లో పరిశు ద్ధ కార్మికులు పనులు చేసేందుకు సిబ్బంది కోరత ఉన్న గ్రామ ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని వార్డులలో ఉన్న చెత్తాచెదారం డ్రైనేజీలను ప్రతినెల తాత్కాలిక సిబ్బందితో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించడం జరుగు తుందని గ్రామ సర్పంచ్ సంఘం అమృత తెలిపారు.ప్రజలకు అందుబాటు లో ఉండి గ్రామని అభివృద్ధి పథం లో ఉంచెందుకు ముందటమన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తిర్మణం తో అన్ని వార్డు ల అభివృద్ధి చెసుకుంటు పోతామన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బింకర్ అఖిల్, మాజీ సర్పంచ్ సంఘం సాగర్,పంచాయతీ కార్యదర్శి దివకర్,వార్డుల సభ్యులు తిర్మణి రాకేష్, కర్క వంశీ ,కర్క ప్రథిఫ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గృహ గణన సర్వేను

# పకడ్బందీగా నిర్వహించాలి



**-మెట్‌పల్లి ఆర్డీఓ నరసింహారావు**

**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్,ఏప్రిల్ 18 :** భారత జనాభా గణనలో భాగంగా చేపట్టనున్న మొదటి విడత "గృహ గణన" ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని మెట్‌పల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) నరసింహారావు అధికారులను ఆదేశించారు.శనివారం వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెట్‌పల్లి మండల ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ప్రతి ఇంటిని సందర్శించి గృహ స్థితిగతులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించిన 33 ప్రశ్నల సమాచారాన్ని సేకరించాలి. సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నీతూ, హెచ్.ఎం శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ తిరుపతి, ఆర్.ఐలు ఉమేష్, కాంతయ్య, స్టాటిస్టికల్ ఆఫీసర్ గంగారెడ్డి, ట్రైనర్లు రాజేందర్, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో సాయి జీనియస్

# హైస్కూల్‌కు ఉత్తమ పాఠశాల పురస్కారం




**-"ప్రిన్సిపాల్ చౌకి సుధా రమేష్‌కి ఘన సత్కారం**

**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఏప్రిల్ 18 :** కోరుట్లలోని సాయి జీనియస్ హై స్కూల్ జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందింది. ముంబైకి చెందిన ప్రొఫైల్ పబ్లిషర్స్ సంస్థ నిర్వహించిన మూల్యాంకనంలో పాఠశాల కరికులంను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రిన్సిపాల్ చౌకి సుధా రమేష్ దేశవ్యాప్తంగా ఉత్తమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు.ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని హైదరాబాదులోని నోవిటల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి అందజేశారు.సుధా రమేష్ విశిష్ట నాయకత్వం అంకితభావం విద్యా రంగంపై ఉన్న నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని విద్యావర్గాలు ప్రశంసించాయి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి నాణ్యమైన బోధన విధానాలు సృజనాత్మక విద్యా కార్యక్రమాల అమలులో ఆమె చేసిన సేవలు ప్రశంసనీయం.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ మాట్లాడుతూ ఈ అవార్డు మా పాఠశాలకు గర్వకారణం. ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. సుధా రమేష్ నాయకత్వంలో మరిన్ని విజయాలు సాధిస్తామని విశ్వసిస్తున్నాం అని తెలిపారు.అలాగే టీచింగ్ నాన్-టీచింగ్ సిబ్బంది కలిసి ప్రిన్సిపాల్ ని శాలువా జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

# అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (18) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని అమ్మక్కపేట్ గ్రామంలో అంగన్వాడి -1 కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.ఇబ్రహింపట్నం సర్పంచ్ ల పోరం అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి గ్రాడ్యుయేషన్ డే పాల్గొని ఎల్కే జీ యూకే జీ పూర్తి చేసుకునీ ఒకటవ తరగతికి వెళ్లే విధ్యర్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్ ప్రోగ్రెస్ కార్డు అందచేశారు.అనంతరం మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు బస్కర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలను ప్రవేట్ స్కూల్ కి పంపకుండా అంగన్వాడీ కేంద్రాలకి పంపించాలని,అంగన్వాడీలో ఆటపాట కథల ద్వారా విద్య నేర్చుకుంటారని,వారి యొక్క మెదడు అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి సరిత, హెల్త్ సూపర్వైజర్ సులోచన, ఏఎన్ఎం రాజమణి,అంగన్వాడి టీచర్ నవనీత ,ఆశ లు వనిత,రేణుక,హరిష్ యాదవ్ ,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్యలో ఘనంగా కిండర్ గార్డెన్ ప్రోగ్రాం




**చురకలు, విలేఖరి,వెల్గటూర్, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా మండల కేంద్రం వెల్గటూర్ శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం యూకేజీ,ఎల్కేజి విద్యార్థులకు కిండర్ గార్డెన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.యూకేజీ విద్యార్థులు ఉన్నత బాలవిహార్ తరగతి ముగించుకుని ఒకటో తరగతికి వెళుతున్న సందర్భం గా కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బిడారిసతీష్ తెలిపారు .గతమూడు సంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలో వరుసగా సీట్లు సాధిస్తు న్నట్లు ఆయన తెలిపారు.తక్కువ ఫీజులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యను అందిస్తున్నామని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో అబాకస్ వేదిక్ గణితంను విద్యార్థులకు అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు.విద్యార్థులకు సర్టిఫికెట్స్, అబాకస్ వేదిక్ గణితంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు గోల్డ్,సిల్వర్‌మెడల్స్ అందించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులకు శ్రీకారం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి,ఏప్రిల్ 18 :** పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో గల హిందూ స్మశాన వాటిక ముందు నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నూతన పాలక మండలి సహకారంతో స్మశాన వాటికలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే, వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొడ్ల ఆనంద్, ధర్మపురి వేణు,జక్కం బాబు,దీకొండ విష్ణు, మున్సిపల్ డి.ఈ నాగేశ్వరరావు, ఏ.ఈ దీపక్,నాయకులు మైలారపు రాము తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి నేనే మీవద్దకు వస్తా

**-ధర్మారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు**
**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్**



**చురకలు విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 18 :** ప్రజాసమస్యలు పరిష్కరించడానికి తానే స్వయంగా గ్రామాల్లోకి వస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.శనివారం ధర్మపురి నియోజక వర్గం ధర్మారం మండల కేంద్రం వ్యవసాయ మార్కెట్లో రూ.1 కోటి 74 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేయడంతో పాటు ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్,సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్తో కలిసి మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని దీనికి ప్రత్యేక నిధులు ఇవ్వడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ధర్మారం ప్రాంతంలోని విద్యార్థులకు సాంకేతికవిద్యను అందించాలన్న లక్ష్యంతో ఎర్రగుంట పల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలను పదవ తరగతి వరకు అప్ గ్రేడ్ చేశామని పదో తరగతి వరకు 25శాతం ఇతర వర్గాలకు 75శాతం ట్రైబల్ విద్యార్థులకు సీట్లుకేటాయిస్తామని తెలిపారు. మండలకేంద్రంలో మినీస్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడ తామని, పార్టీలకు అతీతంగా నియో జకవర్గ అభివృద్దేలక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.గ్రామ సమస్యలపై ప్రజలు ఎవరు తనకోసం హైదరాబాద్ వంటిదూర ప్రాంతాలకు రావద్దని వారంలో మూడు రోజులు నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులుసద్వినియోగంచేసుకోవాలని కోరారు. మండలంలో మొక్క జొన్న సాగుచేసిన రైతులు ఏలాంటి ఆందోళన చెందవద్దని ఇప్పటికే జగిత్యాల జిల్లాలో ప్రభుత్వం ఆరు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అవసరమైతే ధర్మారం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.గత ప్రభుత్వ కాలంలో రైతులను ఏనాడు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి నాయకత్వం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతుల కు రాయితీ ద్వారా పనిముట్లను పంపిణీచేస్తున్నట్లు,ఇందులో భాగంగాధర్మారం మండలంలోని 61 మందిరైతులకు రూ.18.24 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను మంత్రి అడ్లూరి అందజేశారు.మండలంలోని 23మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ఒకరికి షాదీ ముబార క్ చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు,నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాలకి పిల్లలని పంపించండి

**-ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ**



**చురకలు విలేఖరి,బిర్పూర్, ఏప్రిల్,18 :** స్వేచ్ఛాయుత వాతావరణమైన అంగన్వాడి కేంద్రాలకి పిల్లలని పంపించి ప్రాథమిక విద్యను పునాది వేసుకోవాలి అని ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ అన్నారు.శనివారం బీర్పూర్ సెక్టర్ పరిధిలోని నర్సింహులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ ప్రోగ్రాంను నిర్వహించారు.ఈ సందర్బంగా సూపర్వైజర్ శైలజ మాట్లాడుతూ తల్లి బిడ్డల సంరక్షణ కుటుంబ సభ్యుల ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లల యొక్క శారీరక, మానసిక, భాషాభివృద్ధి పెరుగుదల కూడా ఐదు సంవత్సరంల వయసులోనే ఉంటుంది కావున పిల్లలని స్వేచ్ఛాయుత వాతావరణమైన అంగన్వాడి కేంద్రాలకి పంపించి వారి యొక్క ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు.అంగన్వాడి కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య పిల్లల యొక్క భవిష్యత్తుకు నాంది అని ఇంటికి పునాది ఎలా ముఖ్యమో ప్రతి ఐదు సంవత్సరముల లోపు పిల్లలకి అంగన్వాడి కేంద్రం అంత ముఖ్యమైనది అని అన్నారు.ఆటపాటల ద్వారా విద్యను అందించడం ద్వారా సరైన పోషణ పోషకాహారము తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహనాన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సృజన సుశీన్,ఉప సర్పంచ్ గంగాధరి మల్లేష్,వార్డు సభ్యులు, ఏఎన్ఎం లక్ష్మి,ఆశ వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు లక్ష్మి,స్వప్న,కళావతి,విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి,ఆయాలు,తల్లులు,పిల్లలు ఇతర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తిమ్మాపూర్ ఉప మండల హిందూ సమ్మేళనం




**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఏప్రిల్ 18 :** తిమ్మాపూర్లోని రామకృష్ణకాలనీ గ్రామపంచాయతీ సుభాష్నగర్లో శనివారం సాయంత్రం శ్రీఅనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన కరీంనగర్ విభాగ్ శారీరప్రముక్ చమల కిరణ్ జి,రాష్ట్ర సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమలు మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజనతో హిందువులకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని,హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం,ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు.ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా,సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు .హిందూ ధర్మం ఎంతో గొప్పదని, సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ప్రతి ఒక్కరు దేశభక్తి,జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు.హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు.సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశం,ధర్మం,సంస్కృతి,సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచపరివర్ధన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు.సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు.హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని,హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు.అనంతరం వేద పండితులు జిట్స్ ప్రధాన ఆచార్యులు కే.వరప్రసాద్ చార్యులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి ఉత్సవసమితి కార్యనిర్వహణ బాధ్యులు,ఖండ కార్యవాహ,సహ కార్యవాహ,తిమ్మాపూర్ ఉప మండల ప్రముఖ్లు,ఉప మండలంలోని 8 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

**-ధర్మపురి ఎస్ఐ మహేష్**



**చురకలు విలేకరి,ధర్మపురి,ఏప్రిల్ 18 :** రోడ్డుపై వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ధర్మపురి ఎస్సై మహేష్ వాహనదారులకు సూచించారు.శనివారం అరైవ్ అలైవ్ వారోత్సవాల ముగింపు సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు అని తెలిపారు.అదే విధంగా ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా కాపాడుకోవాలని సూచించారు ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య కానిస్టేబుళ్లు రమేష్ నాయక్ రణధీర్ మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 18 :** ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి లక్ష్మి అనే నిరుపేద మహిళక కుటుంబానికి సాయం ద్వారా నిర్మించనున్న నూతన గృహానికి శనివారం సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ పనులను ప్రారంభించారు.లింగంపల్లి లక్ష్మి తన భర్త గంగాధర్ మరణించడంతో ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది.వీరికి ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో స్థిరపడిన జగిత్యాల సత్యసాయి అభయ హస్తం సభ్యులైన నూనె శివకుమార్ –శ్రీదేవి దంపతుల కూతుళ్లు సంహిత,అమూల్యలు ఓ పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చి రమేష్ను ఫోన్ ద్వారా సంప్రదించారు.దాంతో ఎన్నారైకి చెందిన అక్కాచెల్లెళ్ల ఆర్థిక సహకారంతో నూతన గృహనిర్మాణం కోసం పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపతి,గ్రామానికి చెందిన నాయకులు సుధాకర్, భూమన్న,ప్రశాంత్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం చెక్కులు అందించిన మంత్రి



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 18 :** విద్యుత్ ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం చెక్కులను అందజేశారు.ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన గటిక చిన్నయ్య మూడు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్తో మరణించడంతో చిన్నయ్య భార్య గటిక అమ్మాయికి రూ. 5 లక్షల పరిహారాన్ని రాయపట్నం గ్రామ పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో శనివారం మంత్రి లక్ష్మణ్ కుమార్ అందజేశారు.వెల్గటూర్ మండలం కోటి లింగాల గ్రామానికి చెందిన.రాపాక మహేందర్ గేదె విద్యుత్ షాక్తో మరణించడంతో ప్రభుత్వం తరఫున రూ40వేల పరిహారాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం, గ్రామ సర్పంచ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33% రిజర్వేషన్లు చట్టసభలో కల్పించుడే

**-మహిళా బిల్లుకు ఆమోదం తెలుపుడే**
**-బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 18 :** పార్లమెంట్లో 131వ రాజ్యాంగ సవరణ ప్రకారం మహిళలకు 33%రిజర్వేషన్లు చట్టసభలో కల్పించుడేనని మహిళా బిల్లుకు ఆమోదం తెలుపుడేనని బిజెపిపార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్ అన్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కేవలం 8మంది నాయకులు మాత్రమే శనివారం ఆందోళనలో పాల్గొని పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేసినప్పటికీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్ మాట్లాడుతూ పార్లమెంట్లో 131వ రాజ్యాంగ సవరణ ప్రకారం మహిళలకు 33%రిజర్వేషన్లు చట్టసభలో కల్పించాలని గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిల్లు ప్రవేశ పెడితే ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియాకూటమి అలయన్స్ పార్టీలు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డిఎంకె కాంగ్రెస్ పార్టీ వీరందరూ కలిసి ఓటింగ్లో పాలుగోని మహిళల 33%రిజర్వేషన్ బిల్లుకు వతిరేకంగా వోటింగ్ చేసి బిల్లును నిర్వీర్యం చేశారు .భవిష్యత్తులో ఈ యొక్క పార్టీలకు యావత్ మహిళా లోకం బుద్ధి చెప్తారన్నారు.భారతీయ జనతా పార్టీ ఆదేశానుసారం ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలో కాంగ్రెస్పార్టీ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను తగలబెట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నంది నరేష్ ఊడుగుల యాదగిరి కిరణ్ నాయక్ జితేందర్ అంతేర్పుల తిరుపతి బురక వేణు కొత్తపెల్లి అంజయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మీషన్లు ప్రారంభం

**-కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్**



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 18 :** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరం గాను డిగ్రీ అడ్మీషన్లు ప్రారంభమయ్యాయని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ తెలిపారు.వచ్చే విద్యా సంవత్సర అడ్మీషన్ల కోసం వీణవంకలో ప్రచారం చేపట్టారు. కళాశాలలోని అధ్యాపకులు ఇంటింటా ప్రచారం చేశారు.కరపత్రాలు, వాల్ పోస్టర్ లతో ఇంటింటా తిరుగుతూ కళాశాలలోని వసతులు,బోధనా పద్ధతులు,కోర్సుల గురించి విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ అడ్మీషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు.విద్యార్థులు దోస్త్ ద్వారా అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.మొదటి విడత రిజిస్ట్రేషన్ మే 7వరకు ఉందన్నారు. విద్యార్థుల మొబైల్కు ఆధార్కార్డు లింక్ ఉండాలని,విద్యార్థులు తమ ఎసెస్సీ మెమో,అలాగే కుల,ఆధాయ ధృవీకరణ పత్రాలు,ఒక ఫోటో,ఆధార్ కార్డుతో పాటు ఇంటర్ పాసైనా హాల్ టిక్కెట్ నంబర్ లేదా షార్ట్ మెమో తీసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వస్తే, కళాశాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఇంటర్ పాసైనా విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని కోరారు.అర్హత,నైపుణ్యంగల అధ్యాపకుల బోధనలు,కళాశాల వసతులను సద్వినియోగం చేసుకోనాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్సెక్రెటరీ డా.గణేష్ ,అధ్యాపకులు ఉమాకిరణ్,సాయి పాల్గొన్నారు.

## మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్పీ.జానకి షర్మిల

**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్,18 :** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిర్మల్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి ఎస్పీ వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమే కాకుండా ప్రాణాపాయం కలిగించే చర్య అని స్పష్టం చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు చాలా తీవ్రమైనవని, అలాంటి ఘటనల్లో ప్రాణ నష్టం,శాశ్వత గాయాలు కలగవచ్చని వివరించారు. అదేవిధంగా,వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి ప్రాథమిక రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లితండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ.జానకి షర్మిలతో పాటు టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య,ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు, మైనర్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీనిధి యాదవ్కు సన్మానం

**-తిమ్మాపూర్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండారి బాల్ రెడ్డిల ఆధ్వర్యంలో సన్మానం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 18 :** ఇటీవల ఇంటర్ ఫలితాల్లో బైపిసి విభాగంలో 984/1000 మార్కులు సాధించిన ఎల్లారెడ్డిపేట మాజీ ఉప సర్పంచ్ ఓగ్గు రజిత బాలరాజు యాదవ్ల కూతురు ఒగ్గు శ్రీనిధి యాదవ్ను తిమ్మాపూర్ సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండారి బాల్ రెడ్డి దిశ దినపత్రిక రిపోర్టర్ పెంటం శ్రీనివాస్లు శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా నీట్ విభాగంలో ఎంబీబీఎస్ సాధించాలని వారు ఆకాంక్షించారు.

## 36చెట్లను నరికితే రెండు వేల రూపాయల జరిమాన..!

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 18 :** 'పర్యవరణాన్ని కాపాడండి, లేకపోతే మానవ జాతికి చాలా ప్రమాదం'అని ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ సంస్థలు పర్యావరణ ప్రేమికులు ఘోషిస్తున్నా చెట్ల నరికివేతలు ఆగడం లేదు.ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పోతిరెడ్డిపల్లి నుండి కొనరావుపేట మండలానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న 36కు పైగా నీడనిచ్చే చెట్లను లక్షలాది రూపాయలు వెచ్చించి గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీ వారు నీళ్లుపోసి పెంచుతున్న చెట్లను పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నమేని నరసయ్య చెన్నమేని రాజలింగయ్యలు ఎలాంటి అనుమతులు లేకుండానే ఏదేచ్ఛగా చెట్లను నరికి వేశారు.ఈ విషయాన్ని చురకలు తెలుగు దినపత్రికలో ఏప్రిల్ 13వ తేదీన పంట చేనుకు నీడ వస్తుందని ఏకంగా 36చెట్లు యదేచ్ఛేగా నరికి వేత శీర్షికతో వార్తను బయట పెట్టగా చెట్లు నరికి వేసిన ఇరువురికి


రెండు వేల రూపాయలు
2000/-
Panchayat Secretary

కేవలం రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శి చేతులు దులిపేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శితీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు 36 చెట్లను నరికి వేసిన ఇద్దరు వ్యక్తులకు కేవలం 2000 రూపాయల జరిమానా విధించడం పట్ల వారు జిల్లా కలెక్టర్ కు సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదు చేయనునట్లు గ్రామస్తులు కొందరు తెలిపారు.

# మహిళా బిల్లు అడ్డుకున్న పాపం కాంగ్రెస్ దే

**-మహిళా ద్రోహి సిఎం రేవంత్ రెడ్డి**
**-బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి**
**-హుజురాబాద్లో బీజేపీ నిరసన**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ ఏప్రిల్ 18 :** మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అధినియం బిల్లులు ఆమోదం కాకుండా అడ్డుకున్న పాపం కాంగ్రెస్,ఇండియా కూటమిలదేనని, పార్లమెంటులో బిల్లు వీగిపోయిన ఏప్రిల్ 17 దేశానికి,మహిళా లోకానికి బ్లాక్ డే అని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.మహిళా బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్,ఇండియా కూటమి తీరును నిరసిస్తూ హుజురాబాద్ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్,ఇండియా కూటములకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా గంగాడి మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ ఓర్వలేకపోయిందని,దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న బిల్లుకు కాంగ్రెస్ ఏప్పుడు కూడా సహకరించిన పాపన పోలేదన్నారు.కాంగ్రెస్ మొదటినుంచి మహిళా వ్యతిరేక పార్టీ అని,విపక్షాల నిజ స్వరూపం ప్రజలు అర్థం చేసుకున్నారని విమర్శించారు.దేశాభివృద్ధిలో మహిళలను భాగస్వామ్యులను చేయాలన్న ప్రధాని మోదీ దృఢ సంకల్పానికి విపక్షాలు మరోసారి అడ్డుపడ్డాయన్నారు.పార్లమెంటు సాక్షిగా మహిళా హక్కులను కాలరాశారని, రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలకు ద్రోహం చేసారని అన్నారు. చారిత్రక బిల్లును అడ్డుకొని కాంగ్రెస్, ఇండియా కూటమి చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోయారని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళల 33 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ ను దేశం ఎప్పటికీ క్షమించదని, సీఎం రేవంత్ రెడ్డి మహిళల విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్నారని,ఆయన మహిళా ద్రోహి అని,కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీల పేరుతో మహిళలను తీవ్రంగా మోసం చేశారని ఆయన మండిపడ్డారు.తులం బంగారం, మహిళలకు 2500,కళాశాల విద్యార్థినిలకు స్కూటీలు వంటి ఎన్నో హామీలు ఇప్పటికి అమలు చేయలేదని, మహిళలను మోసంచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మహిళల గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు పంజాల మనోజ్, కొండ ప్రశాంతి మురళి, కొలుగూరి సుమలత సుమన్, తూర్పాటి లక్ష్మీదుర్గ, బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, మండల అధ్యక్షులు పారుపల్లి కొండల్ రెడ్డి, కందుగుల సర్పంచ్ ముప్పుమహేష్, జిల్లా కౌన్సిల్ నెంబర్ రావులవేణు, జిల్లా కార్యవర్గసభ్యులు గంగిశెట్టిప్రభాకర్, పైళ్ల వెంకట్ రెడ్డి,గంగిశెట్టి రాజు, యాంసాని శశిధర్,రావుల పున్నం చందర్,ధర్మరాజు పల్లి ఉపసర్పంచ్ ఆవుల రాజ్ కుమార్,నరాల రాజశేఖర్, తిప్పబతిని రాజు, యాళ్ల సంజీవరెడ్డి, సబ్బని రమేష్, గంట సంపత్, కొలిపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ సేఫ్టీ పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశంసలు

**-సర్టిఫికెట్లు అందించి అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 18 :** జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. జాతీయ రహదారి భద్రతా (రోడ్ సేఫ్టీ) మాసోత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ,రవాణాశాఖ ఆద్వర్యంలో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు,వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేయించారు.అలాగే జిల్లాలోని పలు విద్యాసంస్థల విద్యార్థుల కు ట్రాఫిక్ నియమాలు,రోడ్డు భద్రతా చర్యలపై వ్యాస రచన,క్విజ్,డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా,పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు.ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థుల ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాఫిక్ నియమాలు,రోడ్డు భద్రతా చర్యలపై కుటుంబ సభ్యులకు,సమీప ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధి కారి లక్ష్మణ్ కుమార్,వివిధ పాఠశాలల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలు నాటుదాం.. మనమందరం ఆరోగ్యంగా ఉందాం

**-పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేష్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 18 :** వృక్షో రక్షితీ రక్షితః మొక్కలు నాటుదాం మనమందరం ఆరోగ్యంగా ఉందామని పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేష్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామశివారులో 36కు పైగా చెట్లను నరికిన వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు దుంపిన రమేష్ మాట్లాడుతూ లక్షలు హెచ్చించి వృక్షాలను కాపాడుతూ వస్తుంటే రాక్షసుల్లాగా ప్రవర్తిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారంటూ పర్యావరణ ప్రేమికులు దుంపెన రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.ఒక వృక్షము ఒక మనిషి ప్రాణంతో సమానం అన్నారు,ఒక వృక్షాన్ని నరికితే 100 మొక్కలను నాటిన సమానం కాదన్నారు. అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకు న్నట్లయితే వృక్షాలను మానవుల నుండి కాపాడుకోవచ్చు నన్నారు ఒక వృక్షము 55వేల విలువచేసే ప్రాణవాయువును ఇస్తుంది అనేది ప్రతివ్యక్తి గుర్తుఎరగాల న్నారు.మనం వదిలే కార్బన్డయాక్సైడ్ ను చెట్టు పీల్చుకొని మనకు ప్రాణవాయును ఇస్తుందని లేకుంటే మనకు మనగడా లేదన్నారు మనం పిల్లలను ఎలా రక్షించుకుంటామో అదేవిధంగా వృక్షాలను కూడా భవిష్యత్ తరాల కోసం రక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.వృక్షాల గురించి పట్టించుకోకుంటే వచ్చే తరాలకు మనగడ కష్టమన్నారు.తెలిసికూడా ప్రతి ఒక్కరూ వృక్షాలపట్ల నిర్లక్ష్యం చేస్తున్నా రని నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడు తుందన్నారు.ప్రతి ఏటా ప్రతి వ్యక్తి ఒక్క మొక్కనైనా నాటాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.బర్త్ డే మ్యారేజ్ డేలకు ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలను తింటూ తాత్కాలిక ఆనందాన్ని పొందుతున్నారని ఒక మొక్కను నాటినట్టు అయితే మనం ఆరోగ్యాన్ని తీసుకుంటూ వచ్చే తరాలకు ఆరోగ్యాన్ని ఇవ్వగలిగిన వారం అవుతామన్నారు.

## ఇక పాత నియోజకవర్గాల్లోనే
# 2028 అసెంబ్లీ ఎన్నికలు

**-నియోజకవర్గాల పునర్విభన లేనట్లే..**




**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

నియోజకవర్గాల పునర్విభజన ఇక లేనట్లే.. 2028 అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల్లోనే జరగనున్నాయి. కేంద్రం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన విష యం తెలిసిందే.డీలిమిటేషన్ బిల్లు తెరమీదికి రావడంతో ఇక నియోజక వర్గాల సంఖ్య పెరుగుతుందని అందరు భావించారు.పూర్వ కరీంనగర్ జిల్లాలో 13 నియోజకవర్గాలుండగా ఇది 20కి చేరుకుంటుందని భావించారు.అలాగే పూర్వ జిల్లాలో ప్రస్తుతం కరీంనగర్, పెద్దపల్లి రెండు పార్లమెంట్ స్థానాలుండ గా..మరో నియోజకవర్గం పెరిగే అవకాశం పునర్విభజన ద్వారా కలిగేది. అలాగే మూడు లేదా నాలుగు మండలా లకు ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడనుందని అనుకున్నారు. హుజురా బాద్ డివిజన్లో రెండు నియోజకవర్గాలు రావడంతోపాటు ఆయా మండలాలు వేరే నియోజకవర్గాల్లోకి వెళ్తాయని ప్రచారం జరిగింది.కానీ అనూహ్యంగా డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంతో..క్షేత్ర స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల శ్రేణులు పాత' నియోజకవర్గాల్లో తథావిధిగా 2028 ఎన్నికలు జరుగుతాయనే క్లారిటీ వచ్చాయి.ఇప్పుడున్న సిట్టింగ్ నేతలే నియోజకవర్గాల్లో ఇక స్పీడ్ పెంచను న్నారు. ఎన్నికలకు మరో రెండున్నరేళ్ల సమయం మాత్రమే ఉంది.మరో ఏడాది గడిస్తే..ఆయా పార్టీలు,అభ్యర్థులు మరింత స్పీడ్ పెంచనున్నారు. డీలిమి టేషన్ లేకపోవడంతో కొత్తగా రిజర్వే షన్లు కలిసివస్తే పోటీ చేద్దామనుకున్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

## డంపింగ్ యార్డ్ వద్దంటూ
# కొనసాగుతున్న నిరసనలు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 18 :**

హుజరాబాద్ పట్టణ శివారులో డంపింగ్ యార్డ్, చెత్త నుండి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంటును నిర్మిం చవద్దని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు జేఏసీ శిబిరంలో దీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పలకల ఈశ్వర్‌రెడ్డి, వేల్పుల రత్నం,కొలిపాక సమ్మయ్య, చందుపట్ల జనార్ధన్, సిరిసపల్లి రామారావు తదితరులు మాట్లాడుతూ..ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టి 25 రోజులు గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని కచ్చితంగా అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌కు వరంగల్ కరీంనగర్ తో పాటు ఇతర మున్సిపాలిటీల నుండి పెద్ద ఎత్తున చెత్త వస్తుందని తద్వారా హుజురాబాద్ కాలుష్యమయం అవుతుందని అన్నారు. ప్రజలకు చిన్నారులకు వ్యవసాయానికి రైతులకు హాని చేసే ఈ ప్లాంట్ ను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ అంశాన్ని ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

**-మునిసిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 18 :** తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పై పౌష్టికాహారం పై శ్రద్ధ వహించాలని, వారు ఆరోగ్యంగా ఎదిగేలా చూడాలని హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని కోరారు. శనివారం హుజూరాబాద్ లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, అంగన్వాడి విభాగం ఆధ్వర్యంలో ప్రీస్కూల్ మేళ, పోషన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారుల ఆటపాట అందరిని విశేషంగా అలరించాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మునిసిపల్ చైర్పర్సన్ ఆర్ సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల పోషక ఆహారం కోసం అంగన్వాడీలను నిర్వహిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అందులో వారి వయసు ఆధారంగా పోషకాహారం అందిస్తారని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న విషయాన్ని గుర్తించాలని, నేడు మంచి పోషక ఆహారం అందిస్తే భవిష్యత్తులో ఆరోగ్య భారతదేశం సిద్ధిస్తుందని అన్నారు. ప్రభుత్వం చిన్నపిల్లల ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని వివరించారు. అంగన్వాడి కేంద్రాలకు చిన్న పిల్లలను పంపించడం ద్వారా మానసికంగా కూడా వారిలో పరివర్తన కలుగుతుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుగుణ, సూపర్వైజర్ రమ్య,అంగన్వాడి టీచర్లు,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## హుజురాబాద్ మునిసిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి

**-మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాద్ అహ్మద్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 18 :** హుజురాబాద్ మున్సిపాలిటీలో ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో పరిశుద్ధ పనులను ఎప్పటికప్పుడు ప్రేవేక్షిస్తున్నామని తెలిపారు. నూతన గృహాల నిర్మాణపు అనుమతులను కూడా ఎప్పటికప్పుడు ఇస్తున్నామని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇప్పటికే అన్ని వార్డుల్లో వార్డు అధికారులతో కౌన్సిలర్లతో సమావేశాలు నిర్వహించామని విజ్ఞాపన పత్రాలు తీసుకున్నామని, ప్రాధాన్యత క్రమంగా పనులను త్వరలోనే కౌన్సిల్ ఆమోదంతో చేపడతామని తెలిపారు. గత ఏడాది 100% ఇంటి పన్నులను మునిసిపాలిటీ వసూలు చేసిందని తెలిపారు. వేసవికాలం అయినందున తాగునీటి సరఫరా లో ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలు ఏ సమస్య ఉన్న నేరుగా కార్యాలయంలో తమను సంప్రదించాలని కోరారు. ఎలాంటి పనులనైనా బిల్లులనైనా మునిసిపల్ కౌన్సిల్ ఆమోదంతోనే చెల్లిస్తామని స్పష్టం చేశారు. వరంగల్ కరీంనగర్ రహదారిలో డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎందుకు సంబంధించి కాంట్రాక్టర్లకు కూడా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. శివారు కాలనీలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కౌన్సిల్ సహకారంతో కృషి చేస్తామని వివరించారు.

## జెఎన్టియూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా డా.నర్సింహా



**చురకలు విలేకరి,కొడిమ్యాల, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లిలోని జెఎన్టియూ కళాశాల ప్రిన్సిపల్ డా.జి.నర్సింహా జెఎన్టియూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేయగా, శనివారం ఆయనకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# డా. బోగ శ్రావణిపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితం

**-జిల్లా బిజెపి అధ్యక్షుడు యాదగిరి బాబు**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణిపై ఇటీవలే కొందరు చేసిన వ్యాఖ్యలు అర్థరహిత మని,పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేస్తున్న అసత్య ప్రచారాలను ఆపి వేయాలని జిల్లా బిజెపి అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు.శనివారం ఆయన ఆమట్లాడుతూ పార్టీ అంతర్గత వ్యవహారాలపై పార్టీ నుండి బహిష్కృతులైన కొంత మంది నాయకులు చేస్తున ఆరోపణలు సరికావన్నారు. రాష్ట్రమంతా అన్ని జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్షలు జరుగుతున్నాయని, దీనిలో భాగంగానే పార్టీ ఆదేశాల మేరకు మధుసూదన్ రెడ్డి జగిత్యాలలో కూడా సమీక్ష నిర్వహించారన్నారు. ప్రస్తుతం పార్టీలో లేని,× బహిష్కరణకు గురైన కొంత మంది వ్యక్తులు బీజేపీ రాష్ట్ర నాయకురాలు డా.బోగ శ్రావణిపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అర్థరహిత మైనవన్నారు. ఇవి కేవలం వ్యక్తిగత అసంతృప్తి, స్వప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలని, ఇటీవల జరిగిన ఎన్నికలన్నీ పార్టీ ఆధ్వర్యంలో, ఎంపీ అర్వింద్ నాయకత్వంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. ప్రక్రియ అంతా పార్టీ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా జరిగిందని, పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య ప్రచారం చేయడాన్ని తక్షణమే ఆపివేయాలని, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై పార్టీ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

# తిరుమలాపూర్‌లో బాల్య వివాహాలపై అవగాహన



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఏప్రిల్ 18 :** కొడిమ్యాల మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో శనివారం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా సఖి కేంద్రం అధికారి శారద మాట్లాడుతూ తల్లులకు, కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు, మరియు ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లల్ని చదివిద్దాం బాల్య వివాహాలు చేసుకున్నట్లయితే ఆ నేరానికి ఎలాంటి శిక్షలు పడతాయో వారికి వివరించారు. పిల్లలకు చిన్న వయసుల పెళ్లిళ్లు చేసినట్లయితే వారికి మానసికంగా శారీరకంగా ఎదుగుదల ఉండదని, మాతృ మరణాలు శిశు మరణాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181, జాతీయ అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ 112, అత్యవసర వైద్య హెల్ప్ లైన్ నెంబర్108, ఆపదలో ఉన్న అమ్మాయి హెల్ప్ లైన్ నెంబర్ 8712670783, సైబర్ నేరాలు హెల్ప్ లైన్ నెంబర్ 1930 దివ్యాంగుల హెల్ప్ లైన్ నెంబర్ 155326, వృద్ధుల హెల్ప్ లైన్ నెంబర్ 14567 లా గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు ప్రతిజ్ఞ కూడా చేయించారు. అనంతరం విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, సర్పంచ్ తైదల అంజయ్య,ఉప సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి, వార్డ్ మెంబర్స్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన 2027 ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఏప్రిల్ 18 :** జనగణన 2027 ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమని, ఖచ్చితమైన గణాంకాలు సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు సులభమవుతుందని తెలిపారు. ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ విధానం, డిజిటల్ పద్ధతుల్లో డేటా నమోదు, ప్రజలతో వ్యవహరించే తీరు, గోప్యత పరిరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే ఫీల్డ్లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై మార్గదర్శకాలు అందించారు. జిల్లాలో జనగణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని, ప్రతి ఇంటి సమాచారం సరిగ్గా నమోదు చేయాలని అధికారులం దరికీ సూచించారు.ప్రజల సహకారం లేకుండా జనగణన సాధ్యం కాదని, అందువల్ల ప్రజలు కూడా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, జగిత్యాల రూరల్ తహసిల్దార్ షాదాబ్ హకీమ్, మరియు శిక్షకులు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ మహోత్సవం



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా కేంద్రంలో కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం ప్రధాన అడ్మిన్, కవయిత్రి, లక్ష్మీపూర్ పాఠశాల ఇంచార్జీ ప్రధాన ఉపాధ్యాయురాలు మద్దెల సరోజన గంగారాం పదవి విరమణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే డాక్టర్ సంజాయ్ కుమార్,కళాశ్రీ అధినేత గుండేటి రాజు పాల్గొని సరోజన దంపతులను శాలువా మెమోంటో తో ఘనంగా సత్కరించి అభినందించారు. విశ్రాంత జీవితం ఆరోగ్యంగా ఆనందమయం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ రాము, డిఎస్పి రఘు చందర్,కవయిత్రి అయిత అనిత,కటుకం కవిత, ఉజగిరి జమున, లక్కరాజు శ్రీలక్ష్మి,మద్దెల ప్రభాకర్, గుండేటి బేబి రాణి,గాయకురాలు స్వప్న, ఓదెల గంగాధర్,ముత్యం భాగ్యలక్ష్మి, రామారావు,ఉపాధ్యాయ సంఘ నాయకుడు బి. ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా ఎస్పీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి,జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రేణుక యార ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి రేణుక యారను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

## సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్రావుకు ఘన సత్కారం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్ 18 :** మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్రావును ఆయన విశిష్ట న్యాయపరిశోధనలకు గాను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రేణుక యారా శాలువాతో సత్కరించి అభినందించారు. శనివారం కోరుట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఈ సత్కారం నిర్వహించారు.నాగేశ్వర్రావు నిర్వహించిన చట్టపరమైన పరిశోధనలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా పోలీసు దర్యాప్తులో పాటించాల్సిన చట్టబద్ధ విధానాలు రక్షణలపై ఆయన చేసిన అధ్యయనాలను అలహాబాద్ హైకోర్టు సుప్రీంకోర్టు తమ తీర్పుల్లో ప్రస్తావించడం విశేషం.ఈ సందర్భంగా న్యాయమూర్తి రేణుక యారా మాట్లాడుతూ  మంథని జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్నప్పటి నుంచే నాగేశ్వర్రావు న్యాయపరిశోధనలపై చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం అన్నారు. ఆయన సూచనలు దర్యాప్తు సంస్థలకు  యువ న్యాయమూర్తులకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.జిల్లా న్యాయమూర్తి రత్నాపద్మావతి మాట్లాడుతూ నాగేశ్వర్రావుకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం జిల్లా ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన పరిశోధనలకు ఉన్నత న్యాయస్థానాల తీర్పుల్లో స్థానం దక్కడం అభినందనీయమని కొనియాడారు.

## వృద్ధుల పోషణ విస్మరిస్తే జైలుకే

**-జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్18 :** వృద్ధతల్లి దండ్రుల పోషణ విస్మరించి, వేధింపులకు గురిచేస్తే వారి కొడుకులకు,కోడళ్ళకు, వారసులకు జైలు శిక్ష విధిస్తామని జగిత్యాల డివిజన్ వయో వృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో పి.మధు సూదన్ హెచ్చరించారు. శనివారం వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీవో మధుసూదన్ బుగ్గారంమండలం బుగ్గారం గ్రామానికి చెందిన కొడిమ్యాల రాజయ్య ఇద్దరు కొడుకులు,కోడళ్ళు పోషించక వేధింపులకు గురి చేస్తున్నారని,జగిత్యాల రూరల్ మండలం సంగం పల్లి  గ్రామానికి చెందిన బైరి చిన్న మల్లయ్యను కొడుకు కొడుతున్నాడని, జగిత్యాల పట్టణానికి చెందిన సంకోజీ నారాయణ దంపతులను కొడుకు, కోడలు తరుచుగా దాడులు చేస్తున్నారని,వారితో ప్రాణ భయం ఉందనే ఫిర్యాదులపై కొడుకులు,కోడళ్ళనువిచారించారు.సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వృద్ధ తల్లి దండ్రుల పక్షాన వాదనలు వినిపిస్తూ న్యాయం చేయాలని కోరారు.విచారణకు హాజరు కానివారిపై సైతం చర్యలకు ఆర్డీవో నోటీసులు జారీచేశారు.విచారణల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,సెక్షన్ సీనియర్ సహాయకురాలు పద్మజ పాల్గొన్నారు.

# మోసకారి కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడుదాం

**-జగిత్యాల జైత్రయాత్రను అడ్డుకోవడానికి, రోడ్లు తవ్వుతూ కాంగ్రెస్ చిల్లర ప్రయత్నాలు**
**-రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోండి**
**-హుస్నాబాద్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సదస్సులో మాజీ ఎంపీ వినోద్.. మాజీ ఎమ్మెల్యే సతీష్**



**చురకలు విలేఖరి చిగురు మామిడి ఏప్రిల్ 18 :** హుస్నాబాద్‌శివారు శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమా వేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పార్లమెంట్ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీశాసన సభ్యులు హుస్నాబాద్ వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ,420హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలకు మొండి చెయ్యి చూపించిందని విమర్శించారు,హుస్నా బాద్‌లో జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలి చిందని విమర్శించారు. నూతనంగా గెలిచిన బీఆర్ ఎస్ పార్టీ సర్పంచులకు పార్టీ మరియు నేను అండగా ఉంటా నని వారికి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయక త్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. మాయమాటలు,తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజల్లో తీవ్ర నిరాశ నెల కొందని,కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే వారి వైఫల్యాలు ప్రజలకు స్పష్టమయ్యాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఘన విజయం సాధిస్తారని ఆయన ధీమావ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేసి ప్రజల్లోకి వెళ్లాలని,కేసీఆర్ పాలన లో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటికి చేర్చాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ గారు మాట్లాడుతూ,కొద్దికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్రజలందరూ తిరిగి కేసీఆర్ గారి సమర్థ నాయకత్వం వైపు ఆశగా చూస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పనికిరాదని విమర్శించిన కాళే శ్వరం ప్రాజెక్టును ఇప్పుడు మరమ్మతు లు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం ద్వారా కాంగ్రెస్ నాయకుల మాటలన్నీ అబద్ధమని తేలి పోయింద న్నారు. అలాగే తెలంగాణ-ఆంధ్ర విభజన అంశంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, తెలంగాణపై బీజేపీ అసలు వైఖరి స్పష్టమవుతోందని విమర్శించారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడేది, రాష్ట్ర హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇక ఎల్లుండి 20వ తేదీన జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. ఆ సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమాను లు,ప్రజలు తరలివచ్చాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, మండల స్థాయి ఇన్‌చార్జీలు,యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.



## కేసిఆర్ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



**-జీవన్ రెడ్డిని కలిసిన కేటిఆర్,హరీష్ రావు**
**-సభ ఏర్పాట్లపై చర్చించిన నేతలు**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** ఈనెల 20న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరగనున్న మాజీ సీఎం, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు పరిశీలించారు. అంతకుముందు బిఆర్ఎస్ బహిరంగ సభలో మాజీ సీఎం కేసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరనున్న మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డితో వారు మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. తన నివాసానికి వచ్చిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు జీవన్రెడ్డి సాదరంగా ఆహ్వానించి,శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కేసిఆర్ బహిరంగసభ ఏర్పాట్లు, సభను విజయవంతం చేయడానికి,జనసమీకరణ,తదితర అంశాలపై జీవన్ రెడ్డి,ఆయన అనుచరులతో చర్చించి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

## జగిత్యాల నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర



**-సీఎంకు ఇన్ని రోజులుగా గుర్తుకు రాని మేడిగడ్డ ఇప్పుడు గుర్తుకు వచ్చింది**
**బిఆర్ఎస్ బహిరంగ సభతో కాంగ్రెస్లో భయం మొదలైంది**
**-బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 18 :** జగిత్యాల గడ్డ నుంచే కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యేందుకు జైత్ర యాత్ర మొదలవుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ వివేకానంద మినీ స్టేడియంలో జరగనుండగా శనివారం మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అంతకు ముందు ఇదే సభలో కేసీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరనున్న సీనియర్ నేత టి. జీవన్రెడ్డి నివాసానికి వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం సభాస్థలి వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగిత్యాల నుంచే బిఆర్ఎస్ జైత్ర యాత్ర మొదలవుతుందని, బిఆర్ఎ స్ కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్లో భయం మొదలైందన్నారు. ఇన్నాళ్లు మేడిగడ్డను పట్టించుకోని సీఎం రేవంత్రె రెడ్డి కేసీఆర్ సభ ఉందని తెలిసి అదే రోజు సీఎం రేవంత్రెడ్డి మేడిగడ్డకు పోతున్నారని విమర్శించారు. కేసిఆర్ బయటకు వస్తే గుంటనక్కలు భయపడుతున్నాయని, బిఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన జగిత్యాలలో కేసిఆర్ బహిరంగ సభ విజయవంతం అవుతుందని, మళ్లీ కేసిఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పీకర్కు సమర్పించిన అఫిడవిట్లో లో తాను బిఆర్ఎస్ నే కొనసాగుతున్న తెలిపి, ఇక్కడ కాంగ్రెస్ మంత్రులు, శ్రేణులతో కలసి సమావేశాల్లో పాల్గొంటున్నారని, స్థానిక ఎమ్మెల్యే హైబ్రిడో, క్రాస్ బ్రీడో అర్థం కావడం లేదని ఏద్దేవా చేశారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మాజీ సీఎం కేసిఆర్ జగిత్యాలకు చేరుకుంటారని, సుమారు గంటసేపు బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు
# అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పతకాలు

**-అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పతకాలు**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 18 :** విద్యార్థులకు ప్రాథమిక దశ ఉండే గణిత శాస్త్రం పట్ల అవగాహన కల్పించాలని మరియు అందులో పట్టు సాధించేదందుకు ప్రోత్సాహాన్ని అందించాలని తద్వారా వారికి ఉపాధి అవకాశాలు చాలా ఉంటాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గణిత శాస్త్రం చాలా ముఖ్యమైనదని మరియు అన్ని పోటీ పరీక్షలలో చాలా కీలకంగా వ్యవహరిస్తుందని వారు చెప్పారు. గణిత శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులు శిక్షణ ఇప్పిస్తున్నామని మరియు వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలకు సైతం ఎంపిక చేస్తున్నామని వారు చెప్పారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి శిక్షణ ఇస్తూ ఉత్తమ స్థానాలలో స్థిరపడేటట్టు ప్రోత్సాహం అందిస్తున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్లో పాఠశాలకు చెందినటువంటి జతిన్ సిద్ధార్థ, 4వతరగతి, డి.సిన్దశ్రీ,6వ తరగతి, క్రిషిక్ ప్రీన్స్, 7వ తరగతి, నడిపెల్లి సహార్ష్, 9వ తరగతి ఒ శివ స్మరణ్ రెడ్డి, 9వ తరగతి ప్రశంసా పత్రాలను మరియు పతకాలు సాధించినట్లు వారు హర్షం వ్యక్తం చేశారు. విజేతలుగా నిలిచినటువంటి విద్యార్థులకు పుష్పగుచాలతో అందజేసి భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 18 :** సింగరేణి సంస్థ రామ గుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు శనివారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో



క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వ హించడం జరిగింది. మొత్తము 193 ఖాళీ క్వార్టర్లు ఉండగా,ఫ్రెష్ అలాట్మెంట్ , చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 48 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 08 మంది ఉద్యోగులు హాజరై, 07 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఇంచార్జ్ ఎస్టేటు జియం బి.వి.సత్య నారాయణ తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామ చంద్ర రెడ్డి, సత్రం సమ్మయ్య, సివిల్ డిజియం రాజేంద్రకుమార్,ఇంచార్జ్ పర్సనల్ విభాగాధిపతి వి.సునీల్ ప్రసాద్ ఎస్టేట్స్ అధికారి ఎస్.శ్యామల, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య రెడ్డి, దాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.